## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: తాడికొండ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నూతన లైన్ల నిర్మాణం కారణంగా మంగళవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### నేడు ముప్పాళ్ళలో జెండా ఆవిష్కరణ

ముప్పాళ్ళ: మండల కేంద్రం ముప్పాళ్ళ ముస్లిం కాలనీలోని జెండా చెట్టు వద్ద ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బుల్లెట్‌పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పార్టీ శ్రేణులతో కలిసి సత్తెనపల్లి నుంచి ర్యాలీగా వచ్చి జెండా ఆవిష్కరణ చేసి అనంతరం ముస్లిం సామాజిక వర్గాల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారన్నారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

**నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం**

క్రోసూరు: క్రోసూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం కేక్ కట్‌చేసి పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని, అదేవిధంగా క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు క్రోసూరు జెడ్పీ పాఠశాలలో ఐదు మండలాల వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు చేయూత పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కావున పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, చేయూత లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

### జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తి



రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, బ్రాహ్మణపల్లి, పెదనెమలిపురి, దేవరంపాడు గ్రామాలకు చెందిన జగనన్న ఇళ్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్ సోమవారంతో పూర్తి అయ్యింది. రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో 112, పెదనెమలిపురి పరిధిలో 85, జగనన్న ఇళ్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. త్వరలో డాక్యుమెంట్‌లు లబ్ధిదారులకు అందిస్తామని వీఆర్వో పుల్లయ్య తెలిపారు.

### 16న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి 32వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 16వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ మహోత్సవంలో భాగంగా 14వ తేదీ తెల్లవారుజాము నుంచి ఆలయంలో హరే రామ నామ సంకీర్తన ఏకాహం, ప్రసన్నాంజనేయ స్వామి వారి గ్రామోత్సవం, 15న స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. 16న హనుమత్ దీక్ష విరమణ, సామూహిక ఆకు పూజలు, పొంగళ్ల సమర్పణ, సాయంత్రం తిరునాళ్ల మహోత్సవం జరుగుతుందన్నారు. హనుమత్ జ్యోతిదర్శనం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### కనుల పండువగా కపోతేశ్వరస్వామి కల్యాణం



నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ వేడుకలు సోమవారం తెల్లవారుజామున కనులపండువగా సాగింది. వారంరోజుల పాటు నిర్వహించే కపోతేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకల్లో భాగంగా కల్యాణవేడుక యాజ్ఞిక బ్రహ్మ బ్రహ్మశ్రీ భువనగిరి కపోతేశ్వరశాస్త్రి, కొండ కావూరి వెంకట్రామయ్య శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం సుప్రభాత సేవ, బలిహరణ అనంతరం సాయంత్రం రథోత్సవం జరిపించారు. వేడుకల్లో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ప్రజలకు మేలు చేయడం జగనన్న తత్వం
- ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం
- ఓటు అడిగే హక్కు టీడీపీకి లేదు!
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పట్టణంలో పార్టీశ్రేణులతో కలిసి బుల్లెట్‌పై పర్యటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మీ ఇంట్లో మంచి జరిగితేనే .. మీ కుటుంబంలో సంతోషం ఉంటేనే .. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని 6, 7, 8, 9 వార్డుల్లో సోమవారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి బుల్లెట్ వాహనంపై పర్యటిస్తూ ఆయా వార్డుల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రజలకు మేలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తత్వమని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. ప్రస్తుత ఐదేళ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రతి గడపకు చేరవేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్ డ్వాక్రా మహిళా సంఘాల రుణాలు మాఫీ చేయడంతో పాటు సంఘాలను బలోపేతం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజల్లోకి వెళ్లి అడిగే హక్కు... ధైర్యం వైఎస్సార్‌సీపీ నాయకులకే ఉందన్నారు. ప్రజాభిమానం పొందిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోలేమని తెలిసే చంద్రబాబు నాయుడు పొత్తులకు వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు మరి ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా ప్రజలు జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ సీఎంగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగించేందుకు మరో మారు వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఐదు సంవత్సరాలు నియోజకవర్గంలో తన పరిపాలన ఏ విధంగా ఉందో మీరంతా గమనించారన్నారు. అధికారం కోసం పార్టీలు, జెండాలు మారుస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పేరుతో ప్రజల ముందుకు వస్తున్న విశ్వాసఘాతకులను ఓడించాలన్నారు. చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దని, పేదవాడి భవిష్యత్తు బాగుండాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీకి ప్రజలు, కార్యకర్తలే బలమని, సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రోహిణి ట్రేడర్స్ అధినేత భవిరిశెట్టి మారుతి దుకాణం వద్ద టీ బ్రేక్, ఎస్ఎస్పీ మరియదాసు ఇంటి వద్ద అల్పాహారం బ్రేక్ ఇచ్చారు. అనంతరం ఆయా వార్డుల్లో పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేష్, పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు గుజ్జర్లపూడి కృపారావు, దేవరశెట్టి రవికుమార్, గుజ్జర్లపూడి ప్రమీల, రేపూడి రవితేజ, చుక్క మోషే, పెద్దింటి వెంకటేశ్వర్లు, పెద్దింటి నాగేశ్వరరావు, లోకా మాధవ, అవ్వారు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ గెలిచేది నేనే

- అభివృద్ధి , సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు
- చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు ఇంటికి రావు
- చరిత్రలో నిలిచేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పథకాలు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో శంకరరావు
- పెదకూరపాడు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన



లగడపాడులో గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



బలుసుపాడులో రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచేది నేనే అని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా బలుసుపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మరన్నారు. పొరపాటున వైఎస్సార్‌సీపీకి కాకుండా వేరే వారికి ఓటు వేస్తే సంక్షేమం, అభివృద్ధి ఆగిపోతాయన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతాయన్నారు. టీడీపీ వస్తే జన్మభూమి కమిటీలు వచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తారన్నారు. గతంలో ఇంటి స్థలం ఇచ్చి ప్రభుత్వాలు మారిన వెంటనే లాక్కునేవారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా కట్టించి అమ్ముకునే హక్కునూ కల్పించాలరన్నారు. ప్రతి లబ్ధిదారుని

**అంబటి సేవలు మరువలేనివి...**

బలుసుపాడు గ్రామ మాజీ సర్పంచ్ అంబటి వీరయ్య విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బచ్చు హనుమంతురావు, వీరయ్య కుటుంబ సభ్యులతో కలసి ఎమ్మెల్యే శంకరరావు ఆవిష్కరించారు. అంబటి వీరయ్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో బలుసుపాడు గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన సేవలు నేటి యువత మరువరాదన్నారు.

**అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు...**

పెదకూరపాడు మండలంలో ఎమ్మెల్యే నంబూరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా బలుసుపాడు గ్రామంలో రూ.35.90 లక్షలతో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. చిన్నమక్కెన గ్రామంలో రూ.22 లక్షతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తరగతి గదులు, రూ.10.03 లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన పెదకూరపాడు–2 సచివాలయం, లగడపాడు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం జగనన్న కాలనీలో నిర్మించిన షేక్ ఆదం షఫీ ఇంటిని ప్రారంభించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, బచ్చు హనుమంతురావు, సుబ్బారావు, ఎంపీటీసీ ఉమామహేశ్వరరావు, సర్పంచులు వేమవరపు నాగేశ్వరరావు, బత్తుల కోటేశ్వరరావు, బత్తుల రాజేంద్ర, ఎంపీటీసీ షేక్ బుడ్డా, చిన్నమక్కెన సర్పంచ్ షేక్ బాజి, మాగులూరి అనిల్‌కుమార్, షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం**

అమరావతి: నియోజకవర్గ ప్రజలకు ఎక్కువగా పండించే మిరప పంటను నిల్వ ఉంచుటకు అందుబాటులో మండలంలోని లేమల్లెలో రూ.10కోట్లతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కోల్డ్ స్టోరేజ్‌ను పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, సహకార వ్యవస్థ ప్రభుత్వ సలహాదారుడు బత్తుల బ్రహ్మానందరెడ్డిలు ప్రారంభించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండల పరిధిలోని మండెపూడిలో రూ.44 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ మార్కెటింగ్ గోడౌన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్, నాబార్డు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పారుపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు



పారుపల్లి వైద్య శిబిరంలో వైద్యురాలు బాల అంకమ్మబాయి, అధికారులు, సిబ్బంది

పారుపల్లి(క్రోసూరు): మండలంలోని పారుపల్లి గ్రామంలో ప్రజలు తీవ్ర జ్వరాలతో బాధపడుతున్న సమాచారం మేరకు సోమవారం క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాల కేసులు తెలుసుకునేందుకు ఇంటింటికీ వెళ్లి వైద్య బృందం సర్వే చేపట్టింది. పారుపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పారుపల్లి వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాల అంకమ్మబాయి రోగులకు వైద్యం అందించగా శిబిరాన్ని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుభాన్‌బేగ్, ఏఎంవో వెంకటేశ్వరరావులు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ గ్రామంలో జ్వరాల కేసులు లేవని, అయినప్పటికీ జ్వరాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. పారుపల్లి గ్రామంలో వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో రమణ, ఈవోపీఆర్డీ శివరామయ్యకి తెలియజేశారు. ప్రజలకు జ్వరాల పట్ల అవగాహన కల్పించారు. జ్వరాలు రాకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశ్యాంసన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోషణ్ పక్వాడా పట్ల అవగాహన కలిగి ఉండాలి



పోషణ్ పక్వాడాలో చిరుధాన్యాలతో అవగాహనలో అంగన్‌వాడీలు

సత్తెనపల్లి: పోషణ్ పక్వాడా పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి ఐసీడీఎస్ సీడీపీవో టీ శ్రీలత అన్నారు. ఈ నెల 9 నుంచి 23 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న పోషణ్ పక్వాడాలో భాగంగా సోమవారం పట్టణంలోని మున్సిపల్ ఏరియా 22వ వార్డులో నిర్వహించిన పోషణ్ పక్వాడాలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పోషక పదార్థాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రధానంగా మిల్లెట్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో కొన్ని ఆహార పదార్థాలను తయారు చేయించారు. కొర్రలు, స్థానికంగా దొరికే మినుములు ఉపయోగించి ఆహార పదార్థాలు ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సంతోష్ కుమారి, సూపర్‌వైజర్ పి.ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**నాలుగు గ్రామాలలో పోషణ్ పక్వాడా**

అమరావతి: మండల పరిధిలోని నాలుగు గ్రామాలలో క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ ఇమాంబి మాట్లాడుతూ చిరుధాన్యాలలో ఉండే పోషక విలువలను వివరించారు. అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండేలా ఆహారాన్ని ఎలా అనే తయారుచేసుకోవాలో వివరించారు. ఎంద్రాయి, లింగాపురం, నరుకుళ్ళపాడు, వైకుంఠపురం గ్రామాల మహిళా పోలీస్‌లు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి



లింగాపురం వీధులలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని మండల పరిధి గ్రామాల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ ఎ.వి.బ్రహ్మం తెలిపారు. సోమవారం మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో ఎన్నికలు విధులు నిర్వహించే ప్రత్యేక పోలీసు సిబ్బందితో సీఐ బ్రహ్మం ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. అమరావతి సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి శాంతి భద్రతల పరిరక్షించేందుకు అధికంగా బలగాలను నియమిస్తామని ఈ సందర్భంగా సీఐ తెలిపారు. గ్రామాలలో ఎన్నికల సమయంలో ఎటువంటి అల్లర్లు సృష్టించిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కవాతులో ఎస్ఐలతో పాటు సుమారు వంద మంది సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లు: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు అన్నారు. మండలంలోని కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో సోమవారం పోలీస్ కవాతు నిర్వహించారు. పోలీస్ సైరన్ మోగిస్తూ పోలీస్ బృందాలు కవాతు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎం.రాంబాబు మాట్లాడుతూ ఓటర్లు భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# అధైర్యపడవద్దు.. అండాగా ఉంటాం



ఏరియా వైద్యశాలలో పారుపల్లి వాసులను పరామర్శిస్తున్న నంబూరు వసంతకుమారి

సత్తెనపల్లి: ఎవ్వరూ.. అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటామని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి భరోసా కల్పించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో జ్వరాలతో చికిత్స పొందుతున్న క్రోసూరు మండలం పారుపల్లి వాసులను సోమవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. జ్వరాల తీవ్రతకు గల కారణాలను కూడా తెలుసు కొని వాటి నియంత్రణకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా చికిత్స పొందే వారు ఆందోళన చెందవద్దని, అన్ని విధాలా మెరుగైన వైద్యం అందించేలా వైద్యులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలకరించి వారిలో భరోసా నింపారు. అనంతరం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావుతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఆమెతో పాటు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ, క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి, పారుపల్లి గ్రామ సర్పంచ్ పారుపల్లి ముత్తయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు యనభర్ల మోజేష్, తదితరులు ఉన్నారు.

### వైభవంగా ప్రారంభమైన దేవతల బ్రహ్మోత్సవాలు



అచ్చంపేట: అచ్చంపేటకు సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డునగల చామర్రులో దేవతల దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వరసిద్ధి వినాయక, నాభిశిల(బొడ్రాయి)చ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర, అభయ ఆంజనేయస్వామి, పోలేరమ్మల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు స్వామి వారికి మంగళవాయిద్యాలతో గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. గో పూజలు చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్ష ధారణ, పంచగవ్యప్రాసన, అఖండ దీప స్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చివరి రోజు వినాయక స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

### ఎమ్మెల్యే శంకరరావును కలిసిన నియోజకవర్గ పరిశీలకులు



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంకరరావు, నియోజకవర్గ పరిశీలకులు జియావుద్దీన్

క్రోసూరు: ఇటీవల నియమించబడిన వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఎం జియావుద్దీన్ సోమవారం క్రోసూరులోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు జియావుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. మైనార్టీ నాయకులు జియావుద్దీన్‌ను నియోజకవర్గ పరిశీలకులుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసే విధంగా కృషిచేద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం క్రోసూరులో పార్టీ కార్యాలయం వద్ద నుంచి వారు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలా, యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య, పాశం శ్రీనివాసరెడ్డి, అనుముల కోటిరెడ్డి, షేక్ ఖాదర్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

సత్తెనపల్లి: ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన మొనగాడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అయితే, 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని మాఫీ చేసిన మోసగాడు చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలోని భీమవరం గ్రామంలో రూ.60.80 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సోమవారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ, నాయకులు దామచర్ల ధనలక్ష్మీ, బొడ్డు వెంకటరమణ, దామచర్ల లక్ష్మీనారాయణ, మానుకొండ భూపతిరావు, పాలేటి పిచ్చియ్య, ఒంటిపులి దానయ్య, ఆమర్తి వెంకటేశ్వర్లు, మదమంచి కృష్ణ, బొడ్డు వెంకటేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ప్రకటించాలి

- బీజేపీ అవినీతిని బయట పెట్టాలి
- ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలి
- సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య

సత్తెనపల్లి: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని, కోర్టు ధిక్కరణకు పాల్పడిన ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ సత్తెనపల్లి బజారు బ్రాంచ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికలలో ఎలక్టోరల్ బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజి అవినీతికి పాల్పడిందన్నారు. ఈ బాండ్లను ఇటీవల సుప్రీంకోర్టు రద్దుచేసి మార్చి 6వ తేదీలోగా వివరాలను వెల్లడించాలని ఎస్‌బీఐ బ్యాంకులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అయినప్పటికీ గడువులోగా వివరాలను వెల్లడించకుండా 2024 జూన్ 30 వరకు గడువు కావాలని కోరి కోర్టు ధిక్కరణకు పాల్పడిందన్నారు. ఈ ఎన్నికలలో బీజేపీని గట్టెక్కించేందుకు ఎస్‌బీఐ మరికొంత గడువు కావాలని కోరిందని ఆరోపించారు. గడువులోగా వివరాలను వెల్లడించని ఎస్‌బీఐపై వెంటనే కోర్టు ధిక్కరణ కేసులు నమోదు చేయాలని, బీజేపీ అవినీతిని బయట పెట్టాలని, ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్ మురళి మోహన్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, కమిటీ సభ్యులు కట్ట శివ దుర్గారావు, గద్దె ఉమాశ్రీ, మునగా జ్యోతి, గుంటుపల్లి రజని, పంతంగి ప్రభాకర్, ఇంజం లింగయ్య, గింజుపల్లి మస్తాన్‌రావు, గడ్డం సుసులోన్, తదితరులు పాల్గొన్నారు.

### ఒకేరోజు మూడు ప్రాంతాలలో చోరీ

అచ్చంపేట: మండల కేంద్రం అచ్చంపేటలో ఆదివారం అర్ధరాత్రి కొన్ని గంటల వ్యవధిలోనే మూడు వేర్వేరు ప్రాంతాలలో చోరీలు జరిగాయి. అచ్చంపేటలోని ఒక కిరాణా షాపులో సుమారు రెండు గంటల ప్రాంతంలో దుండగులు వెనుకవైపు నుంచి లోనికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.50 వేలు నగదు దోచుకున్నారు. ఆ తరువాత స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులోని ఆఫీసు రూంలోకి ప్రవేశించి బీరువా తలుపులు పగులగొట్టి లోపల ఉన్న లాకర్ తెరిచారు. అయితే డబ్బులు ఏమీ లేకపోవడంతో పలాయనం చిత్తగించారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి వారి దేవాలయంలో హుండీని పగులగొట్టారు. అయితే హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు తప్ప విలువైనవేవి లేకపోవడంతో దుండగలు పరారయ్యారు. చోరీలు ఒకదాని తరువాత ఒకటి జరిగినట్లుగా భావిస్తున్నారు. అంటే మూడు చోట్ల ఒకేబ్యాచ్ ఈ ఘటనలకు పాల్పడి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ షేక్ కరిముల్లా షావలి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కిరాణా షాపులో సీసీ ఫుటేజీను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. క్లూస్ టీంను కూడా రప్పించి దుండగలను సాధ్యమైనంత త్వరలో అదుపులోకి తీసుకుంటామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.